సాక్షి సంగారెడ్డి

బుధవారం । 17 । మే । 2023



మహిళ సంబంధిత కేసుల్లో సత్వర విచారణ 8లో

పోక్సో, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, సంబంధిత కేసుల్లో 60రోజుల్లో సత్వరమే విచారణ పూర్తిచేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత అన్నారు.



క్రీడాకారులకు పోత్సాహం

ఔత్సాహిక క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 10 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందరికి నెగెటివ్ వచ్చిందని టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీ పీసీఆర్ టెస్టులు 11 మందికి చేశారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం తనిఖీ



కేసీఆర్ కిట్‌పై ఆరా తీస్తున్న కలెక్టర్ శరత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రామచంద్రాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా శిబిరాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యసేవలపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. శిబిరంలో 120 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కలెక్టర్‌కు వైద్యులు తెలిపారు. ప్రతీ మహిళ వైద్య పరీక్షలు చేయించుకునే విధంగా సిబ్బంది కృషి చేయలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గాయిత్రీ దేవి, డిప్యూటీ జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ నాగనిర్మల, పోగ్రాం అధికారి డాక్టర్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ దూరం

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ దూరమవుతుందని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం డెంగీ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో జెండాఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ ఆస్పత్రి వరకు కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. అనంతరం జిల్లా వైద్య అధికారి గాయత్రి దేవి మాట్లాడుతూ గత సంవత్సరం 301 డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. ర్యాలీలో జిల్లా వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిజ్ఞాస పోటీలలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లను అందుకుంటున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: విద్యాశాఖ నిర్వహించిన జిజ్ఞాస పరిశోధన పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు విద్యార్థులు ప్రతిభ చాటారు. హిందీ అధ్యాపకురాలు పూనం కుమారి ఆధ్వర్యంలో హిందీ భాష-ప్రపంచీకరణ అంశంపై పరిశోధకులు సరీన్ బేగం, అంకిత కుమారి, ప్రణీత, యాస్మిన్, యూనుస్ పరిశోధన చేశారు. వీరికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి రూ.30 వేల నగదు పురస్కారం లభించింది. అలాగే ఆంగ్ల విభాగంలో ప్రసంగాలు చేయటం ఎలా అనే అంశంపై ఆంగ్ల అధ్యాపకులు డీఎస్ఎస్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో కమల్ తేజ, కిషోరి కుమారి, మేఘన, నేహా, సానియా బేగం పరిశోధన చేశారు. వీరికి రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి రూ.21 వేలు లభించింది. ఆచరణాత్మక విద్యలో భాగంగా చేసిన పరిశోధనలు విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతుందని కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిజ్ఞాస రాష్ట్రస్థాయి హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో బహుమతి ప్రధానోత్సవంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధ్యక్షుడు ప్రొఫెసర్ లింబాద్రి బహుమతులు అందజేశారు. జిజ్ఞాస రాష్ట స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను పర్యవేక్షకులను కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

వసతులు కల్పించాలి

కొండాపూర్(సంగారెడ్డి): విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులు కల్పించాలని ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంగారెడ్డిలో కలెక్టర్ శరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి సెలవులు ఉన్నందున పాఠశాలలో వేసవి మరుగుదొడ్లు, తాగు నీరు, వాటర్ ట్యాంకులు, పరిసరాల శుభ్రత, తరగతి గదులలో ఫ్యాన్‌లు, విద్యుత్ దీపాలు, మరమ్మత్తులు చేయించాలన్నారు.

కేంద్రాల నిర్వహణ అధ్వానం

- అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- రైతులకు వసతులు కల్పించాలి
- పలుకేంద్రాల్లో తనిఖీ చేసిన కలెక్టర్



సోలక్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్

జిన్నారం(పటాన్‌చెరు): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను కల్పించాలని, లేని పక్షంలో అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శరత్ హెచ్చరించారు. జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులను ధాన్యం సేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ తీరు సరిగా లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చే శారు. లోడింగ్ ఇబ్బంది తీవ్రంగా ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లోడింగ్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని, రైతులను ఇబ్బంది పెడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. అనంతరం జిన్నారంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎక్కువ సంఖ్యలో మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో చేపడుతున్న ఆరోగ్య మహిళా కార్యక్రమంపై మహిళలకు అవగాహన కల్పించాలని, ఎక్కువ మంది మహిళలకు వైద్య పరీక్షలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా అధికారి సుగుణాబాయి, వైద్య ఆరోగ్య జిల్లా అధికారి గాయత్రి, తహసీల్దార్ దశరథ్‌సింగ్ రాథోడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ శరత్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం హత్నూర మండలం గుండ్ల మాచునూర్, చింతల్ చెరువు గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎందుకు తూకం వేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

నకిలీ విత్తనాల చెలామణి అరికట్టాలి

సంగారెడ్డిటౌన్: నకిలీ విత్తనాల తయారీదారులు, వాటి విక్రేతలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా గడువు ముగిసిన విత్తనాలను, లైసెన్స్ లేకుండా విక్రయించే వాటిని, ఒక ప్రాంతంలో లైసెన్స్ కలిగి ఉండి, వేరే చోట విక్రయాలు జరిపే వారిపైనా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచించారు. ఈ సందర్భనుగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలతో ఏ ఒక్క రైతు నష్ట పోకూడదన్నారు. నకిలీ విత్తనాల విషయంలో రైతులను చైతన్య పర్చాలన్నారు. తనిఖీల సమయంలో టెస్ట్ కిట్స్ తీసుకెళ్లి రైతులకు పంటల సాగు అనుకూలతపై అవగాహన కల్పించాలన్నారు. వచ్చే వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. అనుమానిత విత్తనాలను వెంటనే శాంపిల్స్ చెక్ చేయాలని ఆదేశించారు. ఎస్పీ రమణ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఆకస్మిక తనిఖీల సమయంలో గడువు తేదీ ముగిసిన విత్తనాలు అమ్మడం, లైసెన్స్ లేకుండా విక్రయాలు చేపట్టడం, నకిలీ విత్తనాల అంశాలపై నిబంధనల మేరకు కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, ఉద్యాన శాఖ డీడీ వేంకటేశ్వర్లు, ఏడీఏలు, ఏఓలు, ఉద్యాన శాఖ అధికారులు, డీఎస్పీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తండా బాధితులకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామం, ఐలాపూర్ తండాల పరిధిలోగల ప్రభుత్వ భూముల్లో దళారుల చేతిలో మోసపోయి ఇళ్లు నిర్మించిన బాధితులకు అండగా ఉంటామని, ప్రభుత్వంతో చర్చించి వారికి పూర్తి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల రెండు గ్రామాల పరిధిలో మోసపోయిన బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నవాబుల కాలంలో ఐలాపురం గ్రామ పరిధిలోని 1200 ఎకరాల భూమిని వ్యవసాయ క్షేత్రంగా వినియోగించే వారన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం తామే భూ యజమానులంటూ పలువురు కోర్టును ఆశ్రయించడంతో, కోర్టు స్టేటస్కో విధించినట్లు తెలిపారు. అనంతరం పలువురు విద్యుత్ ఉద్యోగులు సొసైటీగా ఏర్పడి రాజగోపాల్‌నగర్ పేరుతో భూములు కొనుగోలు చేశారు. ఆ సమయంలో రైతులు కేవలం వ్యవసాయం మాత్రమే చేయాలని, ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని, తుది తీర్పు వచ్చేవరకు కొనసాగించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. 2001లో తాను పటాన్ చెరు ఎంపీపీగా ఉన్నప్పుడు అప్పటి జాయింట్ కలెక్టర్ భీం నాయక్ సమక్షంలో గ్రామ రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం రియల్ ఎస్టేట్ రంగం శరవేగంగా అభివృద్ధి చెందడంతో, కొందరు దళారులు స్థానిక పరిస్థితులపై అవగాహన లేని వారికి తక్కువ ధరకే ప్లాట్లు అమ్ముతున్నామంటూ నిరుపేదలు, దినసరి కార్మికులు, రోజు వారీ కూలీలను మభ్యపెట్టారు. వారికి రెండు గ్రామాల పరిధిలో వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి నోటరీల పేరుతో విక్రయించినట్లు తెలిపారు. ఐలాపూర్ ఐలాపూర్ తండా పరిధిలో ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేస్తున్నారంటూ 52 మంది వ్యక్తులు ముఖ్యమంత్రి కార్యాలయం, భూ పరిపాలన విభాగం, రెవెన్యూ శాఖ, కలెక్టర్, స్థానిక అధికారులు, హైకోర్టుకు ఫిర్యాదులు చేయడం జరిగిందని గుర్తు చేశారు. వీరి ఫిర్యాదుల ఆధారంగా అక్రమంగా నిర్మించిన ఇళ్లను తొలగించాలని కోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. నష్టపోయిన నిరుపేద బాధితులందరికీ తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కోర్టు తుది తీర్పు రైతులకు అనుకూలంగా వస్తే నోటరీలపై కొనుగోలు చేసిన బాధితులందరికీ రిజిస్ట్రేషన్ చేయించడంతోపాటు, ప్రభుత్వం అందించే గృహలక్ష్మి పథకంలో రూ.3 లక్షలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు రెచ్చగొట్టేందుకు వస్తారని, వారి మాయ మాటలను నమ్మకుండా ఓపికతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, డీఎస్పీ భీమ్ రెడ్డి, ఐలాపూర్ సర్పంచ్ మల్లేష్, ఐలాపూర్ తండా నాయకులు రవి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించొద్దు

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

వట్‌పల్లి(అందోల్): గ్రామాల అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వద్దని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొర్రెకల్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పనులు, నర్సరీ, డంపింగ్‌యార్డు, శ్మశాన వాటికలను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఈనెల 17 నుంచి 23 వరకు నిర్వహించే శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు పకడ్బందీగా నిర్వహించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. హరితహారానికి మొక్కలు సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం విషయంలో కార్యదర్శిలు తడి, పొడి చెత్తను వేరుచేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీఓ యూసుఫ్ ఉన్నారు.

ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి

ఆర్డీఓ నగేశ్



జాబితా వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ నగేశ్

జిన్నారం(పటాన్‌చెరు): ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ నగేశ్ అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఓటరు జాబితా సవరణ జరుగుతున్న తీరును మంగళవారం పరిశీలించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు ఉండి స్థానికంగా లేనిపక్షంలో వారి పేర్లను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, తహసీల్దార్ దశరథ్ సింగ్ రాథోడ్, మున్సిపల్ ఆర్వో శ్రీధర్ పాల్గొన్నారు.

బీసీ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: ఈనెల 18వ తేదీన జరిగే బీసీ మహాసమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18వ తేదీన నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ ఎన్నికల్లో కేసీఆర్ బీసీలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చకుండా మళ్లీ ఎన్నికల సమయం రావడంతో మరోసారి బీసీలను మోసం చేసే ప్రయత్నంలో ఉన్న కేసీఆర్ కుట్రను యావత్ తెలంగాణ ప్రజానీకానికి తెలియజేయాలని సమ్మేళన కార్యక్రమం ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మధుకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్ రాజ్, ఎస్ఆర్‌కే యువసేన సభ్యులు షకీల్, రాము, ఫరాజ్, నవీన్, రాకేశ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిఅద్దె కేటగిరీల జాబితా జారీ చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఉద్యోగులకు ఇచ్చే ఇంటి అద్దె కేటగిరీల వారీగా ప్రకటించిన గ్రామాల జాబితా జారీ చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు వేతన సవరణ జరిగినప్పుడు జిల్లాలోని వివిధ ఉపకోశాధికారి పరిధి మండలాల్లో ఏయే గ్రామాలు 2వ కేటగిరిలో 13 శాతం, 3వ కేటగిరిలో 11 శాతం అర్హతగల గ్రామాల జాబితా జారీ చేయాల్సి ఉంటుందన్నారు. సదాశివపేట ఉపకోశాధికారి పరిధిలోని కొండాపూర్, సదాశివపేట మండలంలోని కొన్ని గ్రామాలు 13 శాతం, మరికొన్ని గ్రామాలు 11 శాతం గల ఇంటి అద్దె కేటగిరీల్లోకి వస్తాయన్నారు. కలెక్టర్ జారీ చేసిన జాబితా లేకుండా ఉద్యోగులకు 13 శాతం ఇంటి అద్దె మంజూరు చేయొద్దని ఆడిట్ డిపార్ట్‌మెంట్ అభ్యంతరం తెలిపిందన్నారు. ఫలితంగా ఇప్పటి వరకు 13 శాతం ఇంటి అద్దె పొందుతున్న వారు ఇంటిఅద్దెను కోల్పోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, మర్పల్లి లక్ష్మయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ భాస్కర్, నాసర్ పటేల్, జిల్లా కార్యదర్శులు అశోక్ కుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం

జోగిపేట(అందోల్): ఈనెల 15, 16 తేదీలలో హైదరాబాద్‌లోని అల్వాల్‌లో నిర్వహించిన సీనియర్ రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలలో సంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు ఫైనల్స్‌లో ద్వితీయ స్థానాన్ని పొంది సిల్వర్ మెడల్ సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచినందుకు సంగారెడ్డి జిల్లా టార్గెట్ బాల్ అధ్యక్షుడు సేనాపతి జిల్లా ప్రధాన కార్యదర్శి తరుణ్ రాజు జట్టు క్రీడాకారులను అభినందించారు. నిరంతర సాధనతోనే విజయం సాధ్యపడుతుందన్నారు. క్రీడాకారులు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



జిల్లా క్రీడాకారులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని, గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్‌చెరులోని మైత్రి మైదానంలో మండల, డివిజన్ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు. స్వయంగా వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం క్రీడా రంగానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత నివ్వడంతోపాటు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. మండల స్థాయిలో రాణించిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసే అవకాశం ఉండటంతో తమ ప్రతిభను చాటేందుకు యువతకు మంచి అవకాశమన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడాకారుల కోసం మూడు మినీ స్టేడియాలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు జెడ్పీటీసీ సుప్రజ వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, తహసీల్దార్ పరమేశం, ఎంపీడీఓ బన్సీలాల్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, ఎంఈఓ రాథోడ్, సీఐ వేణుగోపాల్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, మండల అధ్యక్షుడు పాండు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉంటే మళ్లీ గులాబీ రెపరెపలు

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృత్తం కాకుండా కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంగా ఉంటే వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డితో పాటు రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండానే రెపరెపలాడుతుందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మల్కాపూర్ శివారులోగల ఓ పంక్షన్ హాల్లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రైతు చనిపోతే 11 రోజుల్లోగా ఆ కుటుంబానికి రైతుబీమా రూ.5 లక్షలు అందించడం జరుగుతుందన్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో యువతకు సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ తొమ్మిదేళ్లుగా ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో ప్రజలకు చెప్పాలన్నారు. బండి సంజయ్ నిరుద్యోగ మార్చ్ చేపట్టిడం సిగ్గు చేటన్నారు. నిరుద్యోగ మార్చ్ రాష్ట్రంలో కాకుండా ఢిల్లీలో చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ హ్యాండ్లూమ్ చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, జెడ్పీటీసీ పద్మావతి పాండురంగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి అందని పిలుపు

కొండాపూర్ మండలంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి కనిపించకపోవడంతో అక్కడ ఉన్న కొంత మంది నాయకులు ఆశ్చర్యానికి గురయ్యారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి అనుచరుడిగా గుర్తింపు ఉన్న ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు, మరి కొంత మంది నాయకులు హాజరు కాకపోవడంపై పార్టీ నాయకులు వచ్చే ఎన్నికల్లో పార్టీకీ మెజార్టీ రావడం కలేనని చర్చించుకున్నారు. ఎంపీపీకి ఫోన్ చేసి ఆరా తీయగా జిల్లా అధ్యక్షుడి నుంచి సమాచారం రాకపోవడంతోనే సమావేశానికి రాలేదని తెలిపారు.

క్లుప్తంగా

పట్టుబడ్డ బొగ్గు వేలం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న 7టన్నుల బొగ్గును ఇటీవల మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఈ నెల 19న పట్టుబడ్డబొగ్గును చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉదయం 11గంటలకు వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ జయలక్ష్మి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. అధిక ధర పాడిన వ్యక్తికి ఈబొగ్గును అప్పగిస్తామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో మాధవానికుంటలో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని వారు పోలీసులకు చేరవేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని ఒంటిపై తెల్లబనియన్, నల్లప్యాంటు ధరించి, మెడలో ఎర్రటి తాడు, ఎడమ కాలికి నల్లటి తాడు ఆనవాళ్లు ఉన్నాయని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. కుంటలో పడి ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని ప్రాథమిక అంచనకు వచ్చారు. ఎవరైనా సంబంధికులు, తెలిసినవారుంటే తమను సంప్రదించాలని సీఐ కోరారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై నాలుగు రోజుల క్రితం తమ సిబ్బందితో కలిసి డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 7గురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.16,500లు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలిపై అత్యాచారం

పోలీసుల అదుపులో యువకుడు

అక్కన్నపేట(హుస్నాబాద్): వృద్ధురాలిపై యువకుడు అత్యాచారం చేసిన సంఘటన కట్కూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఈ నెల 13వ తేదీన జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వృద్ధురాలి కుమారుడు, నిందితుడు ఇద్దరు స్నేహితులు. ఆదివారం వీరందరు హుస్నాబాద్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. చీకటి పడడంతో వృద్ధురాలి కుమారుడు హుస్నాబాద్‌లోని తన అత్తగారి ఇంటికి వెళ్లాడు. స్నేహితుడితో వృద్ధురాలిని అదేరాత్రి 10గంటల సమయంలో బైక్‌పై కట్కూర్‌కు పంపించాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న నిందితుడు కట్కూర్ గ్రామ సమీపంలో రాగానే క్రషర్ సమీపంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. తెల్లవారుజామున గ్రామంలో ఈ విషయంపై పంచాయితీ నిర్వహించారు. అనంతరం వృద్ధురాలి కుమారై ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వివేక్ కేసు నమోదు చేసుకొని యువకుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ సంబంధిత కేసుల్లో సత్వర విచారణ

సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత


మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: పోక్సో, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, సంబంధిత కేసుల్లో 60రోజుల్లో సత్వరమే విచారణ పూర్తిచేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత తెలిపారు. కమిషనర్ కార్యాలయంలో స్టేషన్, సర్కిల్, ఏసీపీ కార్యాలయ రైటర్లు, టెక్ టీమ్ సిబ్బందికి మంగళవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలోఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఎంపిక కావాలంటే ప్రధానంగా ఐదు అంశాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. దొంగతనాల కేసులను త్వరగా ఛేదించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 60 రోజుల్లో విచారణ పూర్తి చేసి చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయాలన్నారు. మిస్సింగ్ కేసుల్లో ఫొటోలు ఏ రోజుకు ఆ రోజు అప్‌లోడ్ చేయాలని, సాధ్యమైనంత త్వరగా తప్పిపోయిన వారిని ట్రేస్ అవుట్ చేయాలని చెప్పారు. గుర్తుతెలియని మృతదేహాలు దొరికినప్పుడు కేసు నమోదు చేయగానే సంబంధిత ఫొటోలు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. దీంతో ఎక్కడైనా మిస్సింగ్ పర్సన్ యొక్క వివరాలను గుర్తించి కేసులను ఛేదించొచ్చన్నారు. ఈ ఐదు అంశాలపై స్టేషన్ రైటర్లు, టెక్ టీమ్ సిబ్బంది సమన్వయంతో అప్డేట్ చేసుకోవాలని సూచనలు చేశారు. బెస్ట్ పోలీస్ స్టేషన్ ఎంపిక గురించి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సలహాఇచ్చారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు వస్తే రివార్డులు, అవార్డులు తప్పకుండా వస్తాయన్నారు.

సీసీటీఎన్ఎస్ సిస్టంలో అప్‌లోడ్ చేసిన చార్జిషీట్‌ను సీపీ స్థాయి నుంచి డీజీపీ స్థాయి అధికారుల వరకు మానిటర్ చేస్తున్నందునా విచారణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. స్టేషన్ రైటర్లు, సర్కిల్ రైటర్లు ఇరువురు సమన్వయంతో విధులు నిర్వహించి యుఐ కేసులను తగ్గించాలని తెలిపారు. జిల్లా వర్టికల్ మానిటరింగ్ అధికారి సీసీఆర్బి ఏసీపీ చంద్రశేఖర్, మానిటరింగ్ అధికారి రూరల్ సీఐ జానకిరామ్ రెడ్డి, సీసీటీఎన్ఎస్ వర్టికల్ అధికారి దుబ్బాక సీఐ కృష్ణ కేసులను ఛేదించిన తీరు, కేసులను టెక్నాలజీతో ఎలా ఛేదించాలి అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు.

వైన్‌షాపుల తనిఖీ


నిజాంపేటలో వైన్ షాపులను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక వైన్స్, లాస్య వైన్స్‌లను మంగళవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌ఐ విజయ్ సిద్దార్థ మాట్లాడుతూ వైన్ షాపులలో ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువకు మందు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నౌకరి నామా పత్రాలను రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది దుర్గారెడ్డి, స్వామి, శ్రీకాంత్, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంలో తనిఖీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఓ ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంపై ఎస్ఓటీ, రామచంద్రాపురం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం..తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయ సమీపంలో ఐస్‌క్రీమ్ తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ లభించిన పదార్థాలను స్వాధీనం చేసుకొని సంబంధిత కార్యాలయాలకు పరీక్షల నిమిత్తం పంపించారు. అనంతరం ఐస్‌క్రీమ్ తయారు చేసే సంబంధిత పదార్థాలతో ఎలాంటి హాని లేదని తేలినట్లు సంబంధిత అధికారులు వివరించారన్నారు.

బస్సులో మరిచిపోయిన వస్తువుల అప్పగింత


వస్తువులను ప్రయాణికులకు అందజేస్తున్న డిపో మేనేజర్ వేంకటేశ్వర్

హుస్నాబాద్: బస్సులో మరిచిపోయిన వస్తువులను హుస్నాబాద్ డిపో మేనేజర్ బాధితునికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు వచ్చింది. ఆ బస్సులో ప్రయాణికులు మరిచి పోయిన రెండు బ్యాగులతో పాటు క్యాష్ వ్యాలెట్, సెల్‌ఫోన్ ఆర్టీసీ సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని కండక్టర్ ఆగారెడ్డి, డ్రైవర్ సంపత్ డిపో మేనేజర్‌కు తెలియజేశారు. సెల్‌ఫోన్ నంబర్‌తో ప్రయాణికుల వివరాలు సేకరించారు. అనంతరం నర్మెట్టకు చెందిన ఇద్దరిని గుర్తించారు. అనంతరం హుస్నాబాద్ డిపోకు ఆనందాస్ కృష్ణ, లక్ష్మిలను పిలిపించి డిపో మేనేజర్ వెంకటేశ్వర్ బస్సులో మర్చిపోయిన వస్తువులను అందజేశారు.సెల్‌ఫోన్, రూ.1600 నగదు ఉన్నట్లుగా బాధితులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు, జీవితంపై విరక్తితో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పులిగుట్ట తండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..పులిగుట్ట తండాకు చెందిన సీతారాం(40) వ్యవసాయంతో పాటు కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యంకు బానిసయ్యాడు. ఈ క్రమంలో కుటుంబ భారం కూడా పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో కుటుంబ కలహాలు పెరగడమే కాకుండా మరోవైపు ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. సోమవారం సాయంత్రం పొలానికి వెళ్తున్నానని చెప్పి పురుగుల మందు తాగి అక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఈ విషయంపై పోలీసులకు సమాచారం చేరవేశారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.


సీతారాం మృతదేహం

జీవితంపై విరక్తితో..

రామాయంపేట(మెదక్): జీవితంపై విరక్తితో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలోని ఆర్‌వెంకటాపూర్ పిట్టల కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం..కాలనీకి చెందిన పిట్టల క్రిష్ణ(38)కు ఇద్దరు భార్యలు నలుగురు పిల్లలున్నారు. గత కొంతకాలంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన క్రిష్ణ సోమవారం రాత్రి తను నివసిస్తున్న గుడిసెలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పిట్టల క్రిష్ణ (ఫైల్)

మెదక్ రూరల్: కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హవేళిఘణాపూర్ మండలం నాగాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన చాకలి లక్ష్మయ్య(70) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీన్ని గమనించిన కుటుంబీకులు చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం... పట్టణంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ సమీపంలో మంగళవారం ఉదయం జాతీయ రహదారిపై పటాన్‌చెరు నుంచి హైదరాబాద్ వెళ్లే గుర్తుతెలియని వాహనం 60 నుంచి 65 సంవత్సరాల వయసు గల వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. డయల్ 100 ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీస్‌స్టేషనులో సంప్రదించాలన్నారు.

లోకల్ యాప్ యజమానిపై కేసు నమోదు

సంగారెడ్డి మున్సిపాలిటీ: సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీలో ఓ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం అనే శీర్షికతో తప్పుడు వార్తను లోకల్ యాప్‌లో ప్రచురించినందుకు లోకల్ యాప్ యజమాని మెట్టు రమేష్‌పై జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ నరసింహ పుల్కల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుల్కల్ ఎస్‌ఐ విజయ్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి


వినోద్ శివాజీ రాజ్వాడ్ మృతదేహం

కోహీర్(జహీరాబాద్): ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గురుజువాడ గ్రామ శివారులో చోటు చేసుకొంది. రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం..వినోద్ శివాజీ రాజ్వాడ్(20) లాతూర్ జిల్లా, కెరడ గ్రామ నివాసి. తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ఉదయం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా రైలు డోర్ వద్ద నిలబడి ఉన్న వినోద్ ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు.

గేదెను చంపింది హైనానే

పాదముద్రలతో ఫారెస్ట్ అధికారి నిర్ధారణ


హైనా పాదముద్రను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని శంశిరెడ్డిపల్లితండా శివారులో సోమవారం రాత్రి గుర్తుతెలియని జంతువు దాడిలో గ్రామానికి చెందిన కాట్రోత్ శంకర్‌కు చెందిన పాడిగేదె మృతిచెందింది. రాత్రి పది గంటల సమయంలో గేదె మెడను కొరికి చంపినట్లు గ్రామస్తులు గుర్తించారు. తెల్లారేసరికి గేదె కళేబరం దాడిచేసిన స్థలానికి కొద్ది దూరంలో ఉంది. గ్రామస్తులు రాత్రి అక్కడినుంచి వెళ్లిపోయిన తరువాత ఆ జంతువు మళ్లీ గేదె శరీరాన్ని తినేందుకు వచ్చింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి రవికుమార్ తన సిబ్బందితో మంగళవారం ఉదయం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. సంఘటనాస్థలం వద్ద లభించిన పాదముద్రలు బట్టి గేదెపై దాడి చేసింది హైనాగా గుర్తించారు. పంట పొలాల వద్ద గేదెలను పాడిపశువులను కట్టేసేవారు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ అందజేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన కొరివి రాజేందర్ సెల్ ఫోన్ ఈ నెల 8వ తేదీన అపహరణకు గురైంది. దీంతో సీఈఐఆర్ ఫోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం సీఈఐఆర్‌తో గుర్తించి ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్ బాధితుడు రాజేందర్‌కు బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.

పోగొట్టుకున్న ఫోన్

వర్గల్(గజ్వేల్): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్‌తో గుర్తించి ఎస్‌ఐ సంపత్‌కుమార్ రికవరీ అనంతరం బాధితునికి అందజేశారు.

సర్టిఫికెట్‌ల అందజేత

బెజ్జంకి(సిద్దిపేట): సీపీఆర్ గురించి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌లు అందజేశారు. అత్యవసర సమయాల్లో చేయాల్సిన సీపీఆర్ గురించి శిక్షణ పూర్తి చేసుకున్న మండల యువకులకు మంగళవారం బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్ సర్టిఫికేట్‌లను అందజేశారు. అత్యవసర సమయాల్లో సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి పులిగుట్ట తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..పులిగుట్ట తండాకు చెందిన బాణోత్ రాజు(45) ఈ నెల14న మాసాయిపేటకు వెళ్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పి జేసీబీ గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్ర గాయాలుకాగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాజు మృతి చెందాడు.

మెడికల్ షాపుపై దాడి చేసిన వ్యక్తికి జైలు

జహీరాబాద్ టౌన్: అద్దె విషయంలో మెడికల్ షాపుపై దాడి చేసిన వ్యక్తికి 3 నెలల సాధారణ జైలుతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి అనూష తీర్పు ఇచ్చారని జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని చిన్న హైదరాబాద్‌కు చెందిన గంగారం జగన్‌మోహన్‌రెడ్డి పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన నయిమొద్దీన్‌కు చెందిన దుకాణం అద్దెకు తీసుకుని మెడికల్ షాపు పెట్టుకున్నాడు. యజమాని ఆదేశాల మేరకు 2016 సంవత్సరంలో జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి అద్దె చెల్లించి దుకాణం ఖాళీ చేశాడు. ఈ క్రమంలో సదరు మెడికల్ షాపుకు వచ్చి దుకాణం అద్దెకు సంబంధించి రూ.65వేలు బకాయి ఉందని, చెల్లించాలని జగన్‌మోహన్‌రెడ్డితో గొడవకు దిగాడు. మెడికల్ షాపుపై దాడిచేసి మందులను ధ్వంసం చేశాడు. ఈ మేరకు అప్పట్లో జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశాడు. జూనియర్ సివిల్‌జడ్జి అనూష విచారణానంతరం తీర్పు ఇచ్చారు. మెడికల్ షాపుపై దాడి చేసిన నయిమొద్దీన్‌కు 3నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఈతకెళ్లి ఇద్దరు మృతి


రోదిస్తున్న కుటుంబ సభ్యులు


విష్ణు (ఫైల్)


మల్లేశం (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): వాగులోకి దిగిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన విషాద సంఘటన మిరుదొడ్డి మండల పరిధిలోని లింగుపల్లి శివారు కూడవెల్లి వాగులో జరిగింది. పోలీసులు, మృతుల బంధువుల తెలిపిన వివరాల ప్రకారం ..దుబ్బాక మండలం చేర్వాపూర్ పిట్టల వాడకు చెందిన గుజరాతి శ్యామల అర్జున్ దంపతుల కుమారుడు మల్లేశం(17), శాంతమ్మ కనకయ్య కుమారుడు విష్ణు (17) ఇద్దరు అన్నదమ్ముల పిల్లలు. వీరు తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. అన్న సుధాకర్ లీజుకు తీసుకున్న మామిడి తోటలో కాయలు తెంపడానికి మంగళవారం మల్లేశం, విష్ణులు కలిసి వెళ్లారు. మధ్యాహ్నం పూట ఎండ ఎక్కువగా ఉండడంతో ఉపశమనం కోసం పక్కనే ఉన్న కూడవెల్లి వాగులోకి ఈతకని అన్నతో కలిసి వెళ్లారు. మల్లేశం, విష్ణులు నీటిలోకి దిగారు. ఈత రాని విష్ణు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతూ కేకలు వేశాడు. దీంతో ఈత వచ్చిన మల్లేశం విష్ణుని రక్షించే ప్రయత్నం చేశాడు. భయంతో విష్ణు మల్లేశంను గట్టిగా పట్టుకున్నాడు. దీంతో ఇద్దరూ నీట మునిగి గల్లంతయ్యారు. గట్టుపై ఉన్న సుధాకర్ వీరిద్దరిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇది గమనించిన చుట్టు పక్కల రైతులు వెంటనే పోలీసులకు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దుబ్బాక సీఐ కృష్ణ, మిరుదొడ్డి ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో మృత దేహాలను గట్టుపైకి చేర్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డిపై హత్యాయత్నం

నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు


గొంతు, చేతికి గాయాలతో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ బూరిగారి వెంకట్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. వెంకట్ రెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో రోడ్డు వైండింగ్‌లో భాగంగా గుడిసెను పోగొట్టుకున్న శ్రీనివాస్ మాజీ సర్పంచ్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో శ్రీనివాస్ తన వెంట తెచ్చుకున్న బ్లేడుతో వెంకట్‌రెడ్డి గొంతు కోసే యత్నం చేశాడు. ఈ ఘటనలో వెంకట్ రెడ్డి మెడతో పాటు చేతివేలికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే గన్‌మెన్, పోలీసులు దాడికి పాల్పడ్డ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దాడికి పాల్పడ్డ నిందితుణ్ని రిమాండ్‌కు తరలించారు.

దాడిని ఖండించిన శ్రీకాంత్ గౌడ్

ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డిపై జరిగిన హత్యాయత్న దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డిని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా ప్రజల్లో ఉంటూ ప్రజా సేవకునిగా పనిచేస్తున్న, మాజీ సర్పంచ్‌పై ఇలా దాడి జరగడం బాధాకరమన్నారు.

ఫాంల్యాండ్ వద్ద జింక మృతి


జింక కళేబరం

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా మోడ్రన్ ఫామ్ వద్ద మంగళవారం జింక మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని మోర్గితోపాటు కారాముంగి శివార్లలో కొందరు వ్యాపారులు భూములను కొనుగోలు చేసి గుంటలుగా ప్లాట్లను విక్రయించేందుకు ఫాంల్యాండ్స్‌ను ఏర్పాటు చేశారు. వీటి చుట్టూ ఇనుప ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి కరెంటు కనెక్షన్లు ఇస్తుండడంతో జింకలు తరచూ మృత్యువాత పడుతున్నాట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కుక్కలను సైతం ఫాంలాండ్‌లలో పెంచుతున్నారని వారు తెలిపారు. ఈ విషయంపై పశువైద్యాధికారి డా.లక్ష్మిని ప్రశ్నించగా కుక్కల దాడిలో మృతి చెంది ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫాంలాండ్స్‌లపై చర్యలు తీసుకొని జింకల సంరక్షణకు పాటుపడాలని స్థానిక జనం కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


ఆవు కళేబరం

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సిర్గాపూర్ మండలంలోని అంతర్‌గ్రామానికి చెందిన గుడుంబ గణపత్‌రావుకు సంబంధించిన పశువులను తన వ్యవసాయ భూమిలో మేపుతుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద 11కెవి తీగలు తాకి ఆవు అక్కడికక్కడె మృతి చెందింది. దీంతో రూ.60వేలు విలువ చేసే ఆవు మృతి చెందిందని బోరున విలపించాడు.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న గడ్డి దగ్ధం

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యుత్ వైర్లు తాకి ట్రాక్టర్‌లోని గడ్డి దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..సిద్దిపేట శివారులోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు దర్గపల్లిలో పశువుల మేతకు గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. ఈ క్రమంలో సికింద్లాపూర్ శివారులో చేరుకోగానే అక్కడ విద్యుత్ వైర్లు తాకి ట్రాక్టర్‌లోని గడ్డికి నిప్పంటుకుంది. దీన్ని గమనించిన డ్రైవర్ ట్రాక్టర్ ఆపి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. సర్పంచ్ జయవర్ధన్ రెడ్డి అక్కడకు చేరుకొని జేసీబీతో ట్రాక్టర్‌లోని గడ్డిని తొలగించారు. ఈ ఘటనలో ట్రాక్టర్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. రూ.20వేల గడ్డి పూర్తిగా కాలిపోయిందని రైతు ఆవేదన వెలిబుచ్చాడు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అదృశ్యం

గేదె పాలు పిండేందుకు వెళ్లి..


ఆంజనేయులు(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: గేదె పాలు పిండేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఆంజనేయులు ఆదివారం గేదె పాలు పిండేందుకు గ్రామంలోని గేదెల షెడ్డు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆంజనేయులు కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చార్‌ధామ్ యాత్రకని వెళ్లి


సాయి కిరణ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఉత్తరాఖండ్ చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..బీరంగూడ పరిధిలోని శ్రీకృష్ణ దేవరాయ కాలనీ ఫేజ్–2కు చెందిన సాయి కిరణ్(23) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన ఉత్తరాఖండ్ చార్ధామ్ యాత్రకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. 15వ తేదీ ఉదయం సాయి కిరణ్ కుటుంబ సభ్యులకు గంగ్రోతి నుంచి రుషికేశ్ వెళ్తున్నానని సమాచారమిచ్చాడు. తిరిగి సాయంత్రం కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తండ్రి గోవింద రాజు తన కుమారుడి అదృశ్యంపై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్గల్‌లో మహిళ


గొలనుకొండ సాయమ్మ(ఫైల్)

వర్గల్(గజ్వేల్): కూలీ పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పివెళ్లిన మహిళ తిరిగి రాలేదు. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..శేరిపల్లికి చెందిన గొలనుకొండ సాయమ్మ(55) ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచి, ఇంట్లో రోజువారి పనులు పూర్తిచేసుకుంది. ఉదయం 7గంటలకు కూలీపనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కొడుకు స్వామి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.